క్లుప్తంగా

ఇంజినీరింగ్‌లో విద్యార్థికి ఉచిత సీటు



సత్యఈశ్వర్‌ను సత్కరిస్తున్న కాజులూరు కళాశాల అధ్యాపక సిబ్బంది, గ్రామ పెద్దలు

కాజులూరు: ప్రతిష్టాత్మక వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) అమరావతిలో కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి యాళ్ల సత్యఈశ్వర్‌కు బీటెక్‌లో ఫ్రీ సీటు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సత్యశ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం విద్యార్థి సత్యఈశ్వర్‌ను కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన పలువురు విద్యార్థులకు అమరావతిలోని విట్ ద్వారా ఇంజినీరింగ్‌లో నాలుగేళ్లు ఉచిత విద్యను అందిస్తున్నారన్నారు. ఈ ఏడాది ఇంటర్‌లో 976/1000 మార్కులతో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన తమ విద్యార్థి యాళ్ల సత్యఈశ్వర్‌కు కాకినాడ జిల్లా నుంచి బాలుర విభాగం నుంచి ఫ్రీ సీటుకు ఎంపిక కావటం గర్వించదగ్గ విషయమన్నారు. సత్యఈశ్వర్‌ను కళాశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవ పూజలు



వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న భక్తులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ఏడిద గ్రామంలోని సీతానగరం రోడ్డులో విద్యా గణపతి, సంతాన సుబ్రహ్మణ్యేశ్వర, ప్రసన్న అభయాంజనేయ స్వామివార్ల ఆలయం ఎనిమిదో వార్షికోత్సవ పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది.

క్షయ వ్యాధిపై అవగాహన



సోమేశ్వరంలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

రాయవరం: క్షయ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు అనిరుధ్, రామచంద్రపురం టీబీ ఆస్పత్రి సూపర్‌వైజర్ డాక్టర్ లీల తెలిపారు. మండలంలోని సోమేశ్వరంలో గురువారం క్షయ వ్యాధికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్షయ వ్యాధి ప్రమాదకరం కాదని, అవగాహన ఉంటే ఆరు నెలల్లో పూర్తిగా నయమవుతుందని వివరించారు. క్షయ వ్యాధి ఉన్న వారి నోటి తుంపర్ల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. ఎక్స్‌రే ద్వారా వ్యాధి నిర్ధారణ చేయవచ్చన్నారు. అలసట, తలనొప్పి, జ్వరం, రాత్రి పూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నుంచి నెలకు రూ.వెయ్యి నగదు, ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు.

లక్ష్యం... బహుదూరం

- కౌలు రైతులపై ప్రభుత్వం చిన్నచూపు
- సాగు హక్కు పత్రాల మంజూరులో జాప్యం
- కనీసం గ్రామ సభలూ నిర్వహించని వైనం



ఖరీఫ్ సాగు పనుల్లో కూలీలు

రామచంద్రపురం రూరల్: ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెడుతున్న అన్నదాత కష్టాలు కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదు.. వారిపై అడుగడుగునా నిర్లక్ష్యం చూపుతోంది.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసాతో రైతన్నలకు ఆర్థిక ఆసరాగా నిలవగా, ఇప్పుడు కూటమి పేరు మార్చి అన్నదాతా సుఖీభవ ఇస్తామని చెబుతున్నా అదెక్కడా అమలయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కౌలు రైతులకు అందించాల్సిన సాగు హక్కు పత్రాల (సీసీఆర్‌సీ) మంజూరు లక్ష్యానికి బహుదూరంగా ఉండడం చూస్తుంటే.. ప్రభుత్వానికి రైతులపై, వ్యవసాయంపై ఎంత చిన్నచూపు ఉందనేది స్పష్టమవుతోంది. రెవెన్యూ శాఖ 11 నెలల కాల పరిమితితో కౌలు రైతులకు సాగుహక్కు పత్రాలు అందిస్తుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు భూయజమానులకు అవగాహన కల్పించి కౌలు రైతులకు సాగుహక్కు పత్రాలు అందించేవారు. దీనికోసం ప్రత్యేక గ్రామసభలూ నిర్వహించేవారు. కౌలు పత్రాలు ఉంటేనే ప్రభుత్వం రాయితీపై అందించే విత్తనాలు, ఎరువులతో పాటు ప్రకృతి విపత్తులతో నష్టపోతే పరిహారం, బ్యాంకుల్లో రుణం పొందే అవకాశం ఉంటుంది. ఇంత ముఖ్యమైన సాగుహక్కు పత్రాల విషయంలో కూటమి ప్రభుత్వం జూన్ ముగుస్తున్నా ఏటా నిర్వహించాల్సిన రైతు సదస్సుల ఊసే లేకపోవడం నిర్లక్ష్యానికి పరాకాష్టగా మారింది.

జోరుగా నారుమళ్లు

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నారుమళ్లు వేసే పనిలో రైతన్నలు ఉన్నారు. ఇప్పటికే కాలువల ద్వారా నీరు అందుతుండడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో కౌలు రైతులకు రాయితీలు అందాలంటే తప్పనిసరిగా సాగుహక్కు పత్రాలు (సీసీఆర్‌సీ) ఉండాలి. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండపేట మండలంలో 16,008 ఎకరాలు, కపిలేశ్వరపురం మండలంలో 15,763, రాయవరం మండలంలో 14,101, అలాగే రామచంద్రపురం మండలంలో 17,963, కె.గంగవరం మండలంలో 15,589, కాజులూరు మండలంలో 19,083 ఎకరాల్లో వరి సాగు జరుగుతుంది. వ్యవసాయంలో కీలకమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు ప్రభుత్వ రాయితీలు పొందాలంటే సాగుహక్కు పత్రాలు లేక కౌలు రైతులు ఇబ్బంది పడే పరిస్థితి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయాలని రైతన్నలు కోరుతున్నారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల మంజూరు ఇలా..

మండలం	లక్ష్యం	ఇచ్చినవి
రామచంద్రపురం	8,118	25
కె.గంగవరం	7,988	54
కాజులూరు	6,235	337
మండపేట	5,462	43
కపిలేశ్వరపురం	5,786	233
రాయవరం	4,290	61

శ్రద్ధ చూపితే మేలు



సాగుహక్కు పత్రాల మంజూరులో ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది. దేశ ప్రధాని మోదీ దృష్టిలో పడాలని యోగా నిర్వహణలో చూపిస్తున్న శ్రద్ధలో కొంతైనా రైతులు, వ్యవసాయం పట్ల చూపిస్తే బాగుంటుంది. కౌలు రైతులకు తక్షణం సాగు హక్కు పత్రాలు మంజూరు చేయాలి. అప్పుడే వారు రాయితీలు పొందగలరు.

–సాగి వీరభద్రరాజు, అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం, రామచంద్రపురం నియోజకవర్గం

ఉన్నతాధికారుల సూచన మేరకు..



ఉన్నతాధికారుల సూచనల మేరకు త్వరలో గ్రామ సభలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం. అర్హత కలిగిన కౌలు రైతులకు సాగుహక్కు పత్రాల మంజూరుకు భూ యజమానుల్లో అవగాహన కల్పిస్తాం. కౌలుదారులకు ఇబ్బంది రాకుండా చూస్తాం.

–బండి మృత్యుంజయరావు, తహసీల్దార్, రామచంద్రపురం రూరల్

22న ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

కపిలేశ్వరపురం (మండపేట): కొత్తగా మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఈ నెల 22న జరుగుతుందని కమిటీ కార్యదర్శి పీవీఎస్ సుబ్బరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కమిటీ చైర్మన్‌గా మండపేట మండలం చిన ద్వారపూడికి చెందిన చింతపల్లి రామకృష్ణ, వైస్ చైర్మన్‌గా కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామానికి చెందిన మోటిపల్లి బాపిరాజు, డైరెక్టర్లుగా 18 మంది ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. మండపేట పట్టణ బస్టాండ్ వద్దనున్న సూర్య కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి కమిటీ పరిధిలోని ఎమ్మెల్యేతో పాటు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరవుతారని తెలిపారు.

రాజీవ్‌తోనే సాంకేతిక విప్లవానికి నాంది

కపిలేశ్వరపురం (మండపేట): దేశంలో సాంకేతిక విప్ల వం దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హయాంలోనే నాంది పలికిందని పలువురు వక్తలు పేర్కొన్నా రు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా మండపేట పట్టణంలోని మయూరి వృద్ధాశ్రమంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, మండపేట, కపిలేశ్వరపురం మండల కమిటీల అధ్యక్షులు మగ్గం జాకబ్‌రాజు, గేదెల శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశాన్ని సాంకేతిక, ఆర్థిక రంగాల్లో రాజీవ్‌గాంధీ విశేషంగా అభివృద్ధి చేశారన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

కాజులూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణలపై సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల కారణంగా గ్రామాల్లో పారిశుధ్యం సమస్య తలెత్తి డయేరియా, టైఫాయిడ్, మలేరియా, ఫైలేరియా, డెంగీ, గున్యా తదితర వ్యాధులు సక్రమించే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయమై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు.

ఇరవై రోజులుగా ఇంతే..



ద్రాక్షారామ మాగాపువారి వీధిలో రోడ్డు పైనే ఇసుక, కంకరతో ఇబ్బంది పడుతున్న వాహనదారుడు

రామచంద్రపురం రూరల్: కూటమి నాయకుల మధ్య లుకలుకలు ప్రజలకు అగచాట్లు మిగుల్చుతున్నాయి. ఆ వివరాల్లోకి వెళితే.. ద్రాక్షారామ మాగాపువారి వీధిలో 11వ వార్డు సభ్యురాలు బండి కుమారి పరిధిలో డ్రైను, రోడ్డు నిర్మాణం నిమిత్తం వర్క్స్ కమిటీ మెంబరు, జనసేన నాయకుడు కర్రా నాగేశ్వరరావు ఇసుక, కంకర దిగుమతి చేశారు. అయితే డ్రైన్ నిర్మాణం పూర్తికాగా సీసీ రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. ఇదిలా ఉండగా ఇటీవల కూటమి ప్రభుత్వం రేషన్ షాపులను తిరిగి ప్రారంభించింది. ఈ క్రమంలో ద్రాక్షారామలోని 11వ వార్డు పరిధిలోని రేషన్ డిపోను గ్రామ సర్పంచ్, టీడీపీ నాయకురాలు కొత్తపల్లి అరుణ రాకుండా కూటమికి చెందిన జనసేన నాయకులు ప్రారంభించేశారనే అక్కసుతో సర్పంచ్ రోడ్డు నిర్మాణం ఆపివేయించారని జనసేన నాయకులు అభిప్రాయపడుతున్నారు. దీని కారణంగా 20 రోజులుగా రోడ్డు పైనే ఇసుక, కంకర ఉండిపోవడంతో ఆటోలు, కార్లు మాట అలా ఉంచి ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నాయని, చాలా మంది పడిపోయారని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



దూరప్రాంత విద్యార్థులకు సైకిళ్లు అందజేసిన ఎంపీటీసీ రెడ్నం సతీష్, సర్పంచ్ మంగాదేవి

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరం జెడ్పీ హైస్కూల్‌కు దూర ప్రాంతాల నుంచి వచ్చే ఆరుగురు విద్యార్థులకు ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యుడు రెడ్నం సతీష్ గురువారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సహకారంతో గ్రామంలోని పాఠశాలను హైస్కూల్‌గా అభివృద్ధి చేసినప్పుడు ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తామని మాటిచ్చారన్నారు. అయితే తల్లిదండ్రుల అభిప్రాయం మేరకు గత ఏడాది దూర ప్రాంత విద్యార్థులకు ఉచిత ఆటో సదుపాయం కల్పించగా, ఈ ఏడాది విద్యార్థులకు తల్లిదండ్రుల అభిప్రాయం మేరకు ఇచ్చిన మాట ప్రకారం సైకిళ్లు అందజేశారు. ఈ సైకిళ్లను గ్రామ సర్పంచ్ యనమదల మంగాదేవి చేతుల మీదుగా ఇచ్చారు. విద్యా కమిటీ చైర్మన్ గీసాల వీరవెంకట రామ్‌ప్రసాద్, వైస్ చైర్మన్ అడపా రాంబాబు, ప్రధానోపాధ్యాయుడు ముమ్మిడి సత్యనారాయణ, ఉపాధ్యాయులు వాసంశెట్టి వెంకటరమణ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పాలిక శ్రీరామలక్ష్మి పాల్గొన్నారు.

సూక్ష్మ పోషకాలతో నాణ్యమైన దిగుబడులు



అంబాజీపేటలో ఎరువుల డీలర్లకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

అంబాజీపేట: కొబ్బరి పంటకు ఉపయోగించే ఎరువులు, సూక్ష్మ పోషకాల వాడకంలో సమతుల్యత పాటిస్తే, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా కేంద్రం అధిపతి డాక్టర్ ఎం.ముత్యాల నాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో సొసైటీ ఎరువుల డీలర్లకు సర్టిఫికెట్ కోర్సు శిక్షణలో భాగంగా గురువారం స్థానిక కొబ్బరి పరిశోధనా కేంద్రంలో విజ్ఞాన యాత్రను, కొబ్బరి మొక్కల పోషణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొబ్బరి పంటకు అవసరమైన ప్రధాన, ద్వితీయ సూక్ష్మ పోషకాలు, మోతాదుల సమతుల్యతపై స్థానిక శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.కిరీటి, డాక్టర్ నీరజ ప్రయోగాత్మకంగా వివరించారు. కొబ్బరిలో సేంద్రియ ఎరువుల వినియోగాన్ని వివరించి శిక్షకులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ చల్లా నరసింహారావు మాట్లాడుతూ తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో పనిచేసే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై 15 రోజుల సర్టిఫికెట్ కోర్సుపై శిక్షణ కార్యక్రమాన్ని ఏరువాక కేంద్రంలో ఈ నెల 9 నుంచి ప్రారంభించామన్నారు. స్థానిక పరిశోధనా కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలను, జీవ నియంత్రణ పద్ధతులను శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిత్య జీవితంలో భాగంగా యోగా



మండపేటలో జరిగిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు



రామచంద్రపురంలో యోగా విశిష్టతను విద్యార్థులకు వివరిస్తున్న తొగరు మూర్తి



నవ ధాన్యాలతో రూపొందించిన చిహ్నంతో మాచర విద్యార్థులు

కపిలేశ్వరపురం (మండపేట): ప్రతి ఒక్కరి రోజువారీ జీవితంలో యోగా భాగం కావాలని మండపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీకేవీ శ్రీనివాస్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో గురువారం పట్టణంలో యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం, జాతీయ సేవా విభాగాల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత చేకూరుతాయన్నారు.

నవ ధాన్యాలతో యోగా డే చిహ్నం

కపిలేశ్వరపురం: మండలంలోని మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నవ ధాన్యాలతో యోగా డే చిహ్నం రూపొందించారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా డే సందర్భంగా ఎనిమిదో తరగతి విద్యార్థులు సాయి, శ్రీరాం, వినయ్, వంశీ, వీరాంజనేయులు మనో వికాసంతో యోగా ప్రాధాన్యాన్ని చాటి చెప్పారు. నవ ధాన్యాలైన గోధుమలు, ధాన్యం, కందులు, పెసలు, శనగలు, ఉలవలు, బొబ్బర్లు, చోళ్లు, అణువులతో యోగాసనం భంగిమతో యోగా చిహ్నం తయారు చేశారు. విద్యార్థులను గురువారం పాఠశాల హెచ్ఎం ఖండవిల్లి విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

రామచంద్రపురం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని చైతన్య ఉచిత యోగా శిక్షణ సంస్థ వ్యవస్థాపకుడు తొగరు మూర్తి అన్నారు. అంతర్జాతీయ యోగా డే సందర్భంగా స్థానిక మోడరన్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థినీ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా తొగరుమూర్తి మాట్లాడుతూ దేశంలో పతంజలి మహర్షి అందించిన యోగా విద్య వల్ల మానవునికి కలిగే ఆరోగ్య ప్రయోజనాలను గుర్తించి ఐక్యరాజ్య సమితి 2015 జూన్ 21న 189 దేశాల మద్దతుతో అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. యోగా విద్యను ప్రతి ఒక్కరూ అభ్యసించి రోగాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి యోగా ఉపయోగపడుతుందని, దీనికి కళాశాల యాజమాన్యాలు సహకారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ డాక్టర్ జీవీ రావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆర్గనైజర్ మాణిక్యం, సుధాకర్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

నమ్మించి మోసగించిన కూటమి



కొత్తపేటలో 'జగన్ అంటే నమ్మకం - బాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

- హామీలను విస్మరించిన చంద్రబాబు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

కొత్తపేట: ఎన్నికల ముందు అనేక హామీలతో ప్రజలను నమ్మించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఇప్పుడు మాట మార్చుతుందని మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. 143 హామీలిచ్చి ఒక్కటీ అమలు చేయలేని నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానికంగా వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు స్వగృహం వద్ద బుధవారం రాత్రి జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో 'జగన్ అంటే నమ్మకం - చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే చేసిన అప్పు రూ.1.50 లక్షల కోట్లని, ఏం చేశారో.. లెక్కలు మాత్రం లేవన్నారు. దీనిపై ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో కూటమి ప్రభుత్వం రోజుకో డైవర్షన్ పాలిటిక్స్‌తో తప్పుదోవ పట్టిస్తుందని అన్నారు. పచ్చమీడియా చంద్రబాబుకు వత్తాసు పలుకుతూ ప్రజలను మోసం చేస్తోందని వ్యాఖ్యానించారు. సూపర్ సిక్స్ హామీల్లో స్త్రీశక్తి, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, కొత్త పింఛన్ల ఇంత వరకూ అమలు చేయకపోవడం చంద్రబాబు చేతకాని పాలనకు నిదర్శమన్నారు.

నారా లోకేష్ రెడ్‌బుక్ పాలన పేరుతో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌ను నిద్రావస్థలోకి పంపించాడన్నారు. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుంటే మహిళా హోం మంత్రి మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకుడు కర్రి నాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల బ్రహ్మానందం, రావులపాలెం యువజన విభాగం అధ్యక్షుడు జవ్వాది రవి, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

కళాత్మకం.. ఉట్టిపడితే అద్భుతం

- కొబ్బరి పీచుతో అందమైన వస్తువుల తయారీ
- శిక్షణ పొందుతున్న 30 మంది మహిళలు



పీచుతో హ్యాండీ క్రాఫ్ట్స్‌పై శిక్షణ పొందుతున్న మహిళలు

మామిడికుదురు: శిక్షణ ఉంటే ఏ రంగంలోనైనా రాణించొచ్చు... కళాత్మకతతో అద్భుతాలు సృష్టించవచ్చు.. కొబ్బరి పీచుతో కళాత్మకమైన వస్తువుల తయారీపై మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. పాశర్లపూడిబాడవలో 216వ నంబర్ జాతీయ రహదారిని ఆనుకుని ఈ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. గత నెల 30న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హ్యాండీ క్రాఫ్ట్స్ విభాగం డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ పేరిట ఈ కేంద్రం పెట్టారు. పాశర్లపూడికి చెందిన ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరమ్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇక్కడ ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ కొబ్బరి పీచుతో కళాత్మకమైన వస్తువుల తయారీపై మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. పలు రకాల బొమ్మల తయారీపై మెళకువలు నేర్పుతున్నారు. ఈ నెల 29వ తేదీ వరకూ శిక్షణ కొనసాగుతుంది. గతంలో శిక్షణ పొంది ప్రభుత్వ గుర్తింపు కార్డు కలిగిన మహిళలను ఈ శిక్షణకు ఎంపిక చేశారు.

ఉపాధికి తోడ్పాటు

మహిళలు తమ స్వశక్తిపై ఆధారపడి తీరిక సమయాల్లో బొమ్మలు తయారు చేస్తూ తద్వారా ఉపాధి పొందాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ శిక్షణతో పురుషులతో సమానంగా మహిళలు ఎదగాలన్నది సంకల్పం. దీనికి అనుగుణంగా ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొబ్బరి తోటలకు ఎంతో ప్రసిద్ధి చెందిన కోనసీమలో ఈ కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా బహుళ ప్రయోజనం ఉంటుంది.

మామిడికుదురు మండలంలో మహిళలు కొబ్బరి ఉత్పత్తులను కుటీర పరిశ్రమగా చేసుకుని ఇప్పటికే ముందడుగు వేస్తున్నారు. అటువంటి వారికి మరింత చేయూత అందించాలన్న లక్ష్యంతో శిక్షణ ఏర్పాటు చేశారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న మహిళలకు ఒక్కొక్కరికి రోజుకు రూ.300 స్టయిఫండ్ కూడా ఇస్తున్నారు. పాశర్లపూడి, అప్పనపల్లి, పెదపట్నంలంక గ్రామాలకు చెందిన మహిళలు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు.

చక్కని బొమ్మల తయారీ



కొబ్బరి పీచుతో అందమైన ఎన్నో బొమ్మలు తయారు చేసే అవకాశం ఉంది. దీనిపై ఇంత వరకూ మాకు పెద్దగా అవగాహన లేదు. 20 రోజుల నుంచి మాకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. ప్రతి విషయాన్ని ఎంతో చక్కగా విశ్లేషిస్తున్నారు. ఈ శిక్షణ ద్వారా మాకు ఎంతో మేలు జరుగుతుంది. చక్కటి బొమ్మలు తయారు చేసే అవకాశం మాకు కలిగింది. ఇక నుంచి మేము కూడా బొమ్మల తయారీ ద్వారా గణనీయమైన అభివృద్ధిని సాధిస్తాం.

–అడబాల లక్ష్మి, అప్పనపల్లి

స్వయం సమృద్ధి సాధిస్తాం



మహిళలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించే దిశగా కొబ్బరి పీచుతో బొమ్మల తయారీపై ఇస్తున్న ఉచిత శిక్షణ మాకు ఎంతో ఉపయోగపడుతుంది. దీనిని ప్రాంత మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ తరహా శిక్షణ కార్యక్రమాలను మరింతగా విస్తరించాలి. పాశర్లపూడికి చెందిన ఆక్సిజన్ అసోసియేషన్ మహిళలకు ఉపయోగపడే ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఆ అసోసియేషన్ సహకారం మరువరానిది.

–మద్దాల దేవి, పాశర్లపూడి

ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు..



కొబ్బరి పీచుతో ఆకట్టుకునే ఎన్నో బొమ్మలు తయారు చేయవచ్చు. ఇక్కడ ఉన్న సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటే మహిళలకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. 20 రోజుల నుంచి బొమ్మల తయారీలో శిక్షణ ఇస్తున్నాం. మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఎంతో నేర్చుకోవాలన్న తపన ప్రతి ఒక్క మహిళలో కనిపిస్తోంది. వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుంది.

క్రిస్టీ మీనన్, శిక్షకురాలు, న్యూ ఢిల్లీ